కృష్ణకాలనీ : బీరన్న బోనాలతో వస్తున్న కురుమ కులస్తులు

ఘనంగా బీరన్న బోనాల వేడుకలు

కృష్ణ కాలనీ/ములుగురూరల్/మంగపేట, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం కురుమ కులస్తులు బీరన్న బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తొలి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని బీరన్న ఆలయానికి బోనాలతో ర్యాలీగా తరలివెళ్లారు. ర్యాలీలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి ర్యాలీలో పాల్గొని, బీరన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడు నూతల నిశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, ములుగు మండలంలోని మల్లంపల్లిలో గొల్ల, కురుమల ఆధ్వర్యంలో బీరన్న బోనాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు ఎత్తుకొని బీరన్న గుడికి చేరుకుని మొక్కులు సమర్పించారు. మంగపేట మండలంలోని కమలాపురంలో బీరన్న ఆలయంలో కురుమ కులస్తులు బోనాలు సమర్పించారు.

గణపురంలో పెద్దమ్మ తల్లి బోనాలు

గణపురం : మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ఆలయా నికి చేరుకుని మొక్కులు సమర్పించారు. ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెరిక బజారులో రక్తదాన శిబిరం

వెంకటాపురం(నూగూరు), జూలై 17 : మండల పరిధిలోని పెరిక బజారులో చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 20 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. వైస్ ఎంపీపీ హుస్సేన్ శిబిరాన్ని ప్రారంభించారు. చీడెం సాయితేజ, చీడెం సాయి ప్రకాశ్, గుండమల్ల మధు, పల్నాటి ప్రవీణ్, రాచకొండ రాము, కొప్పుల వినోద్ పాల్గొన్నారు.

సమృద్ధిగా నీరందించడమే లక్ష్యం

- రూ.1.70కోట్లతో ఊర చెరువు మరమ్మతు
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


గణపురం : ఊర చెరువు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

గణపురం, జూలై 17 : ఆయకట్టు పరిధి రైతులందరికీ సమృద్ధిగా నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ధర్మరావుపేట ఊర చెరువు మరమ్మతు పనులు పూర్తి కావడంతో ఐబీ సీఈ విజయభాస్కర్, డీఈ బసవ ప్రసాద్‌తో కలిసి బుధవారం రైతులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సంవత్సరం జూలై నెలలో కురిసిన అతి భారీ వర్షాల వల్ల ఊర చెరువుకు పలుచోట్ల గండ్లు పడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.1.70 కోట్ల మంజూరు చేయించి, చెరువుకు మరమ్మతు చేయించినట్లు తెలిపారు. ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, పూర్తిస్థాయి ఆయకట్టు సాగవుతుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్ రావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ బసవ ప్రసాద్ గౌడ్, ఏఈ సుమారావు, సొసైటీ చైర్మన్ రేపాక రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, కోఆప్షన్ మాజీ సభ్యులు చోటే మియా, సొసైటీ మాజీ చైర్మన్ తాళ్లపల్లి భాస్కర్ రావు, కాంగ్రెస్ నాయకులు సుంకరి సుధాకర్ రెడ్డి, ఆలూరి కుమారస్వామి, పూజరి రాజేందర్ పాల్గొన్నారు.

రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లో.

రేగొండ : రేగొండ, గోరికొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామల్లోని చెరువు మరమ్మతు పనులు పూర్తి కాగా వాటిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. రేగొండ మండలంలోని మడుత్తపల్లి, రేపాకపల్లె, గోరికొత్తపల్లిలోని చిన్నకోడేపాక, కోనరావుపేట గ్రామల చెరువులను మరమ్మతు చేసినట్లు తెలిపారు. అలాగే, గోరికొత్తపల్లిలో నిర్వహించిన మొహర్రంలో ఎమ్మెల్యే పాల్గొని పీరీలకు మొక్కులు చెల్లించారు. హిందు, ముస్లింలు ఐక్యంగా పీరీల పండుగ నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల డీఈ గిరిప్రసాద్, ఏఈలు వినోద్, చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, నాయకులు గుంటోజు కిష్టయ్య, మ్యాకల భిక్షపతి, పున్నం రవి, రవీందర్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

గుడిసెవాసుల సమస్యలు పరిష్కరిస్తా

కృష్ణ కాలనీ : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాతఎర్ర చెరువులోని గుడిసెవాసుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పాతఎర్ర చెరువులో ఏర్పాటు చేసుకున్న గుడిసెవాసులకు తాగునీరు అందించడానికి బుధవారం ఎమ్మెల్యే రూ.2లక్షలతో నూతన బోరు మంజూరు చేయించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా తమకు పట్టాలిచ్చి, రోడ్లు, కరెంటు సౌకర్యం కల్పించి, ఇంటి నంబర్లు ఇప్పించాలని ఎమ్మెల్యేను గుడిసెవాసులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడిసేవాసుల కోరిక మేరకు ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా, బోరు వేయించిన ఎమ్మెల్యేకు సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు దేవన్, కౌన్సిలర్లు శిరుప అనిల్, పిల్లలమర్రి శారదా నారాయణ, ముంజాల రవీందర్, నాయకులు రజనీకాంత్, రాజిరెడ్డి, సీపీఎం నాయకులు వెలిశెట్టి రాజయ్య, గడప శేఖర్, ఆకుదారి రమేశ్, మేకల మహేందర్, విజయలక్ష్మి, రజిని, రోజా, రజిత, నూనేటి నరేశ్, రాజేందర్, సీహెచ్ రవికుమార్, కే రవికుమార్, గట్టు శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముందే పూసిన రాఖీ పువ్వులు

రాఖీ పువ్వు

ములుగురూరల్, జూలై 17 : రాఖీ పండుగ రాక ముందే రాఖీ పువ్వులు ములుగు జిల్లా కేంద్రంలో రాఖీ పూప్పువులు వికసించాయి. ఎంతో అందంగా రాఖీలా కనిపించే ఈ పూలకు ఒక చరిత్ర ఉంది. వీటిని కౌరవులు, పాండువుల పూలు అని కూడా పిలుస్తారు. పువ్వు కింది భాగంలో కనిపించే తెలుపు, నీలి రంగు రేఖలను కౌరవులు అంటారు. ఇవి సరిగ్గా 100 రేఖలు ఉంటాయి. మధ్య భాగంలో ఉన్న ఐదింటిని పాండవులు అని, వాటిపై ఉన్న మూడింటిని గురువులైన భీష్ముడు, ద్రోణుడు, కుంభాచార్యుడని అని, పై భాగంలో ఉన్న ఒక దానిని కృష్ణుడు అని పిలుస్తారు.

మతతత్వ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలి

ములుగురూరల్, జూలై17 : వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 21న ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించే మతతత్వ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. సీపీఎం, సీపీఐ నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, జంపాల రవీందర్, గుండెబోయిన చంద్రయ్య, రత్నం రాజేందర్, గఫూర్‌పాష, రాజు, రాజు పాల్గొన్నారు.

వంతెన వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

టేకుమట్ల, జూలై 17 : మండలంలోని టేకుమట్ల– రాఘవరెడ్డి గ్రామాల మధ్యలో చలివాగుపై పోసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రమాదమని తెలిసినా వంతెనపై పోసిన గర్డర్లపై నుంచి ప్రజలు దాటుతున్నారు. దీనిపై నమస్తేతెలంగాణలో కథనం ప్రచురించడంతో స్పందించిన ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, రెవెన్యూ సిబ్బంది సురేశ్ వంతెనకు అడ్డంగా ఇనుప కంచె వేసి, బోర్డు ఏర్పాటు చేశారు. ఒక హోంగార్డును కాపాలా పెట్టారు. అయితే, వాగులో కోతకు గురైన చోట మొరం పోసి, రవాణా సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

'దళితుడి ఇంటిపై దాడి అమానుషం'

మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కాటారం, జూలై 17 : మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధి బూడిదపల్లి గ్రామంలో కల్వల బాలాజీ అనే దళితుడి ఇంటిపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆలిండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామడిపల్లి బాపయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కోటగిరి పాపన్న, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని బాధితుడి ఇంటిని సందర్శించి, జరిగిన సంఘటనపై ఆరా తీశారు. మంచిర్యాలకు చెందిన పలువురు దాడి చేసి కులం పేరుతో దూషించడమే కాకుండా ఇంటిని నేలమట్టం చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. నాయకులు పొట్ల పోచయ్య, శంకర్, వినోద్, లింగాల రామన్న, సతీశ్, మేరు గు లచ్చన్న, వెంకటేశ్వర్లు, సంపత్ పాల్గొన్నారు. కాగా, ఈ సంఘటనపై డీఎస్పీ రామ్మోహన్ రెడ్డికి బాధితుడు బాలాజీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్

కృష్ణ కాలనీ, జూలై 17 : వర్షాకాలంలో పంటలు పండించుకునేందుకు రైతులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని టీజీఎన్పీడీసీఎల్ జిల్లా నోడల్ అధికారి, సీజీఎం హెచ్ఆర్‌డీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆపరేషన్ టీ మధుసూదన్ అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్, చిట్యాలలోని ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ల కేంద్రాన్ని పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా మండలంలో అత్యధిక ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయినట్లు గుర్తించారు. దానికి అనుగుణంగా రిపేర్లు చేసి, డిమాండ్‌కు తగ్గట్లుగా సప్లయ్ పెంచాలని అధికారులను ఆదేశించారు. లేకపోతే ఇతర జిల్లాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించి రైతులకు అందజేయాలన్నారు. రేగొండ సబ్ స్టేషన్‌లోని లాగ్‌బుక్‌ను తనిఖీ చేశారు. అనంతరం చిట్యాల మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ కేంద్రాన్ని తనిఖీ చేసి రిపేర్ నాణ్యతలో రాజీ పడకూడదని, వ్యవసాయ కొత్త సర్వీసుల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గణపురం మండలం జంగుపల్లి ఫీడర్‌లో సిస్టం స్ట్రెంతనింగ్ పనులను పరిశీలించి, పురోగతిని తెలుసుకున్నారు. భూపాలపల్లి టౌన్ సెక్షన్‌లోని విద్యుత్ అంతరాయాలను తెలుసుకొని, వాటిని తగ్గించేలా భవిష్యత్ కార్యాచరణ ఉండాలని ఆదేశించారు. మహాముత్తారంలోని సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేస్తున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనుల పురోగతిని పరిశీలించి, త్వరగా పూర్తిచేయాలన్నారు. గారేపల్లిలో లిఫ్ట్ ఇరిగేషన్ కోసం కొత్తగా ఏర్పాటు చేస్తున్న సబ్ స్టేషన్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఎస్ఈ బీ మల్చూర్ నాయక్, ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్ డివిజనల్ ఇంజినీర్ ఎన్ సదానందం, భూపాలపల్లి జిల్లా ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మహదేవపూర్,జూలై 17 : భారీ వర్షాలతో మండలంలోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పవన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు తెలపాలని కోరారు.

స్కిల్ కాంపిటిషన్‌లో ఐటీఐ విద్యార్థుల ప్రతిభ

ద్వితీయ బహుమతి సాధించిన ఐటీఐ విద్యార్థులు

ఏటూరునాగారం, జూలై 17 : హైదరాబాద్‌లో ప్రావీణ్య స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటిషన్‌లో ఏటూరునాగారం ఐటీఐ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో సాయి కుమార్, వెంకటేశ్, సిద్ధార్థ్, స్వామి, సాయికుమార్, చరణ్‌కుమార్, మెకానికల్ ట్రేడ్‌లో నందు, శశి కుమార్, ప్రవీణ్, సందీప్, శ్రీతేజ, రమేశ్ పాల్గొని ద్వితీయ బహుమతి అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ఎనిమిది ఐటీఐల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

భూపాలపల్లి జిల్లాలో భారీ వర్షం

23.1మి. మీ వర్షపాతం నమోదు

కాటారం : గోపాల్‌పూర్‌లో మునిగిన పొలాలు

భూపాలపల్లి రూరల్, జూలై 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం ఉదయం 8.30 గంటల వరకు 23.1 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో 48.6, మహాముత్తారంలో 28.6, పలిమెలలో 12.4, కాటారంలో 53.2, మల్హార్‌రావు లో 23.2, టేకుమట్లలో 5.6, మొగుళ్లపల్లిలో 5.4, చిట్యాలలో 6.6, రేగొండలో 14.2, గణపురంలో 34.8, భూపాలపల్లి మండలంలో 22.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. సుమారు 48.6 మీ.మీ వర్షపాతం నమోదుకాగా, రహదారులు జలమయమయ్యాయి. కుదురుపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. చెరువులు, కుంటలలోకి భారీ గా వరద నీరు వచ్చి జలకళను సంతరించుకున్నాయి.

కాటారం మండలంలో..

కాటారం : మండలంలో ఎడతెరిపి లేని వర్షం కారణంగా లోతట్టు గ్రామాలు జలమయమయ్యాయి. భారీ వర్షం కురవడంతో జన జీవనం స్తంభించిపోయింది. గోపాల్‌పూర్, గుండ్రాత్‌పల్లిలో వాగులు ఉప్పొంగడంతో పంట పొలాలు నీట మునిగాయి. పోతుల్‌వాయి వద్ద బొర్ర వాగు, గంగారం వద్ద అలుగు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో కొద్ది గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది.

అయ్యవారిపేటలో..

వాజేడు : ములుగు జిల్లా వాజేడు మండలంలో మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి అయ్యవారిపేటలోని సుంకరి రాజరామ్ తదితర గ్రామస్తుల ఇండ్ల చుట్టూ బుధవారం వరదనీరు చేరింది. వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏటా వర్షాకాలం ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మహదేవపూర్ : చెరువులోకి చేరిన వరద నీరు

వాజేడులో పెరుగుతున్న గోదావరి

వాజేడు: ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో వరద ప్రవహం క్రమంగా పెరుగుతోంది. మండలంలో పేరూరు వద్ద బుధవారం రాత్రి 8 గంటలకు 8.240 మీటర్ల(26అడుగులు) మేర గోదావరి వరద ప్రవహిస్తున్నట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. వరద ముంపు ప్రదేశాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాజేడు: పేరూరు వద్ద ఉధృతంగా గోదావరి

గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కృష్ణకాలనీ, జూలై 17 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్యా సురేశ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాంబాబు నాయక్ మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలు, గూడేలను పంచాయతీలుగా తీర్చిదిద్దిందన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందన్నారు. కానీ, ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి, వారిని ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా అణగదొక్కుతోందని ఆరోపించారు. లంబాడీలపై అణచివేతను వెనకకు తీసుకొని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 9న హైదరాబాద్‌లో నిర్వహించే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభకు జిల్లా నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ వాలు నాయక్, టౌన్ అధ్యక్షుడు గంగావత్ రాజేందర్ నాయక్, మహిళా అధ్యక్షురాలు ధరావత్ శారద, మండలాల అధ్యక్షులు రాజు నాయక్, గోపాల్ నాయక్, రాజు నాయక్, పా ర్వతి, రాజు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : గోదావరి నదీ తీరం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

ఆలయాలకు పాటెత్తిన భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

కాళేశ్వరం/గణపురం/వెంకటాపురం/కాటారం/మహదేవపూర్, జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగా భూపాలపల్లి, ములుగు జిల్లాలో బుధవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కళకళలాడింది. ఉదయం నుంచే సుమారు 20 వేల మంది స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. త్రివేణి సంగమంలో భక్తులు స్నానం చేశారు. వివిధ పూజల ద్వారా రూ.4లక్షల అదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే, గణపురం మండల కేంద్రంలోని శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం(కోటగుళ్ల)లో తొలి ఏకాదశిని పురస్కరించుకొని అర్చకులు జూలపల్లి నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటాపూర్ మండలం పాలంపేట లోని రామప్ప దేవాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెదర్లాండ్ దేశానికి స్టేఫానా, బురక్‌లు, నార్వే దేశానికి చెందిన ఫోక్ హగ్లండ్ దంపతులు ఆలయాన్ని సందర్శించారు. కాటారం మండలంలోని భక్తులు దామెరకుంట సమీపంలో గోదావరి నదికి వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి, అయ్యప్ప దేవాలయాల్లో, ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహదేవపూర్ మండల పరిధిలో కూడా సమీప గోదావరి నదీ తీరంలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. మండల కేంద్రంలోని మందరగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ

మాట్లాడుతున్న సీఐ నరేశ్ కుమార్

భూపాలపల్లి రూరల్, జూలై 17: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, అనేక కేసులకు వాటితో పరిష్కారం దొరికిందని భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్ అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్‌కాలనీ 17వ వార్డులో జెండా లైన్ పెద్దమనుషులు, స్థానిక ప్రజాప్రతినిధులందరూ కలిసి 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోగా వాటిని సీఐ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాలు, కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను నియంత్రించవచ్చన్నారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి సీఐ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాట్లకు మగ కూలీలు..

గోవిందరావుపేట : నాట్లు వేస్తున్న కూలీలు

గోవిందరావుపేట, జూలై 17 : వరి నాట్లు వేయడంలో మగ కూలీలు సత్తా చాటుతున్నారు. గోవిందరావుపేట మండలానికి పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి 12 మంది మగ కూలీలు వారం రోజు క్రితం వచ్చారు. వీరు ఎకరానికి రూ.4500 చొప్పున తీసుకుని రోజుకు ఐదు ఎకరాల వరకు వరి నాట్లు వేస్తున్నారు. ఆడవారు వరి నాట్లు వేసే క్రమంలో దారులను తీసుకుంటూ నాట్లు వేస్తే ప్రస్తుతం మగ కూలీలు ఆరు ఇంచులకు ఒక వరి మొక్కను నాటుతున్నారు. దీంతో రైతులు సైతం పంట దిగుబడితో పాటు ఎరువులు, పురుగు మందులను పొలాల్లో వాడే సమయంలో వరికి చేరుతుందని ఆశిస్తున్నారు. కాగా, పొరుగు రాష్ట్రం నుండి వచ్చిన ఈ మగ కూలీలకు గోవిందరావుపేట మండలం ఉపాధి వనరుగా మారుతుంది.

వరి నాట్లు ప్రారంభం

వెంకటాపురం(నూగూరు) : మండలంలో వరి నాట్లు బుధవారం ప్రారంభమయ్యాయి. జూన్ నెలలో వర్షాలు తక్కువగా కురవడంతో వరి నార్లు పోసి దుక్కులు దున్నకొని సిద్ధంగా ఉన్న రైతులు వర్షం కోసం ఎదురు చూపులు చూశారు. కాగా, జూలై రెండో వారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో నార్లు పోసిన రైతులు నాట్లను ప్రారంభించారు. దీంతో మండలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మంగపేట : పీరీలను తీసుకెళ్తున్న భక్తులు

కాటారం/మంగపేట/ములుగురూరల్, జూలై 17 : గ్రామాల్లో మొహర్రంను హిందూ, ముస్లింలు బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కాటారం, మంగపేట మండలాలతో పాటు ములుగు మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి, కాసిందేవిపేట, జంగాలపల్లి గ్రామాల్లో పీరీలను ఊరేగించి, సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంతకుముందు ఊరేగింపులో భక్తులు పీరీలకు దట్టీలు, కుడకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రంను అన్ని వర్గాల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

'సొసైటీని రద్దు చేయాలి'

గణపురం, జూలై17 : శ్రీ బాలాజీ ల్యాండ్ లూజర్ అసోసియేషన్ సొసైటీని సింగరేణి అధికారులు రద్దు చేయాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు అంబటి శ్రీను, జాయింట్ సెక్రటరీ గడ్డం సమ్మయ్య(జయపాల్), కోశాధికారి కుక్కమూడి కుమారస్వామి, ఈసీ మెంబర్ వడ్డకొండ నాగరాజు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ సింగరేణి ఓసీ–3లో భూములు కోల్పోయిన బసవరాజుపల్లి, నగరంపల్లి, పరుశురాంపల్లి, పెద్దాపురం, గుర్రంపేట గ్రామానికి చెందిన 27 మందితో సొసైటీని 2021లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఏడుగురితో కమిటీ చేసుకోగా అధ్యక్షుడిగా మిట్టపల్లి భద్రయ్యను ఎన్నుకున్నట్లు చెప్పారు. అయితే, సింగరేణి రామప్ప కాలనీలో స్వీపింగ్ పనులు చేసేందుకు సొసైటీకి టెండర్ వచ్చిందని తెలిపారు. అయితే, భద్రయ్య కమిటీకి తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో 43 మందిని రూ.లక్ష చొప్పున తీసుకొని స్వీపింగ్ వర్కర్లుగా నియమించినట్లు ఆరోపించారు. వాటిని భూనిర్వాసితులకు ఇవ్వాల్సి ఉండగా భూములు కోల్పోని వారికి ఇచ్చినట్లు ఆరోపించారు. వెంటనే సొసైటీని రద్దు చేయాలని వారు కోరారు.

అదుపుతప్పి పల్టీకొట్టిన కారు

ప్రమాదానికి గురైన కారు

కన్నాయిగూడెం, జూలై 17 : మండలంలోని ముప్పనప